క్లుప్తంగా

అధికారులకు సన్మానం



భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో ఇంటర్నల్ జూనియర్ సర్వే ఆఫీసర్లుగా ఎంపికైన ఉద్యోగులను మంగళవారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి సన్మానించారు. ఇటీవల కొత్తగూడెంలో జరిగిన పరీక్షలో భూపాలపల్లి ఏరియాకు చెందిన ఎం.రాజశేఖర్ ప్రథమ స్థానం, పి.శ్రీకాంత్ ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. 64 ఖాళీలకు 67మంది అభ్యర్థులు పాల్గొన్నారు. మొదటి రెండు స్థానాలు ఏరియాకు వరించడం సంతోషకరమైన విషయమని జీఎం తెలిపారు. ఈ సందర్భంగా వారిని జీఎం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటరామిరెడ్డి, శైలెంద్రకుమార్, మారుతి, వినోద్‌కుమార్, గుండు రాజు, క్రాంతికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు

భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి వృథా చేయవద్దన్నారు. నీటికి సంబంధించిన ఫిర్యాదులు, వినతుల కోసం మున్సిపల్ కార్యాలయంలో 89781 80036 కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తాగునీటి ఇబ్బందులు ఉన్నట్లయితే ఈ ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మండల కమిటీ ఎన్నిక



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నూతన కమిటీని మంగళవారం ఎన్నికల పరిశీలకులు లక్ష్మణ్ నాయక్, ఎన్నికల అధికారి తిరుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మడక మధు, ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి సారంగపాణి, కార్యదర్శులుగా ఆర్.తిరుపతి, జె.రజిత, శ్రీకాంత్, శ్రీధర్, జి.సాయికుమార్, సంతోష్ కుమార్, శ్రావణ్ కుమార్, సాంబయ్య, ఎస్.సాయికృష్ణ, జిల్లా కౌన్సిలర్‌గా బి.తిరుపతిరెడ్డి, దేవేంద్ర, వీరేశం, ప్రభాకర్ రెడ్డి, సీహెచ్ మొండయ్య, భిక్షపతి ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.ఎర్రయ్య సభ్యులుగా రామమూర్తి, కల్యాణి, మినహాజ్ ఆలీ,హరీష్, లక్ష్మణ్ ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి తదితరులు ఉన్నారు.

బాలికల మినీ గురుకులం పరిశీలన



వాజేడు : మండలంలోని జంగాలపల్లిలోని బాలికల మినీ గురుకులాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశాల మేరకు ఎంపీఓ శ్రీకాంత్‌నాయుడు మంగళవారం పరిశీలించారు. భోజనాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. కూరగాయల నాణ్యతను చూశారు. మినీ గురుకులం వద్ద సైడ్ కాల్వ ఇబ్బందిగా ఉందని దానిని మరమ్మతులు చేయాల్సి ఉన్నట్లు ఎంపీఓ తెలిపారు. భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

వాజేడు: వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతాశిశు సంరక్షణ వైద్యాధికారి యామిని, ప్రగళ్లపల్లి సబ్‌సెంటర్ వైద్యాధికారిణి గ్యానస అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి వైద్యం అందించారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులను పరీక్షించి మందులను ఇచ్చారు. రక్త పోటు ఉన్న వారికి నెలవారీగా మందులను ఆశ కార్యకర్తల ద్వారా అందిస్తామని తెలిపారు. వారి వెంట స్టాఫ్‌నర్స్ అనూష, ఆశ కార్యకర్త ఉన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యపరీక్షలు

వెంకటాపురం(కె) : స్థానిక ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 84 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ములుగు ఏరియా ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్నేహారెడ్డి, హెచ్ఈఓ సత్యనారాయణ, రామకృష్ణ, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్కడ తొలగించారు.. మరి ఇక్కడ?



మానేరులో టోల్‌ను నిలిపివేస్తున్న అధికారులు(ఫైల్)



కిష్టంపేట-బూర్నపల్లి చలివాగులో కొనసాగుతున్న టోల్

- మానేరులో తొలగించిన టోల్..
- చలివాగులో మాత్రం కొనసాగింపు
- అధికారుల తీరుపై విమర్శలు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి శివారు, పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ శివారు మానేరులో వంతెన నిర్మాణానికి పది సంవత్సరాల క్రితం రూ.45కోట్ల నిధులను మంజూరు చేయడంతో కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. కాని ఫిల్లర్ల దశలోనే నిలిపేయడంతో మండలం నుంచి నిత్యం పెద్దపల్లి, మంచిర్యాల వంటి పట్టణాలకు వెళ్లే ప్రయాణికులకు రవాణా భారమైంది. దీంతో గర్మిళ్లపల్లి-ఓడేడ్ మానేరుతో పాటు, బూర్నపల్లి-కిష్టంపేట చలివాగులో తాత్కాలిక మట్టి రోడ్డును రూ.10లక్షలకు పైగా ఖర్చు చేసి స్థానికులు నిర్మించారు. ఈ మేరకు రెండు చోట్ల టోల్ ట్యాక్స్‌తో కొంత సేవా రుసుంను వసూలు చేస్తూ, రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చారు. అప్పటి నుంచి వాహనదారులు తక్కువ దూరంలో గమ్యాన్ని చేరుకుంటున్నారు.

టార్గెట్ మానేరు టోల్

గర్మిళ్లపల్లి-ఓడేడ్ మానేరు టోల్ వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ కొంత మంది అధికారులకు తప్పుడు సమాచారాన్ని అందించడంతో కొనసాగుతున్న టోల్‌ను ఈ నెల 1న రద్దు చేయించారు. దాంతో తాత్కాలిక రోడ్డును ఈ నెల 5న కొంత మేర ధ్వంసం చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్పందించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తాత్కాలిక మట్టి రోడ్డును పునర్ నిర్మించారు. అప్పటి నుంచి వాహనదారులు ఉచితంగా తాత్కాలిక రోడ్డును వినియోగించుకుంటున్నారు.

చలివాగులో కొనసాగింపు

ప్రయాణికుల సౌకర్యార్థం చలివాగు, మానేరుల్లో తాత్కాలిక మట్టి రోడ్డును అధికారులు నిర్మించాల్సి ఉండగా, అది చేయకుండా కొంత మంది రూ.లక్షల్లో నగదు వెచ్చించి ప్రయాణికులకు రవాణా సౌకర్యం కల్పించారు. రెండు నెలల అనంతరం కావాలని అక్రమ టోల్ అంటూ అధికారులకు కొంత మంది ఫిర్యాదు చేయడంతో టోల్ రద్దు చేశారు. రెండు చోట్ల టోల్ కొనసాగితే కేవలం ఒక చోట మాత్రమే టోల్ రద్దు చేసి, మరో చోట కొనసాగింపునకు అవకాశం కల్పించడంతో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నారు. ఒక టోల్‌లో అక్రమ వసూళ్లు అయితే మరొక టోల్‌లో కాదా అంటూ పలువురు అధికారుల తీరును తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బూర్నపల్లి-కిష్టంపేట టోల్‌ను రద్దు చేసి ఉచిత ప్రయాణానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులే నిర్మించాలి



“ మానేరు, చలివాగులో ప్రభుత్వమే నిధులు కేటాయించి తాత్కాలిక రోడ్డును నిర్మించాలి. ప్రైవేట్ వ్యక్తులు నిర్మించిన రోడ్డు వద్దనుకుంటే ప్రారంభంలోనే నిలిపివేయాలి. అంతే కానీ రోడ్డు నిర్మించాక వద్దనడం సరైంది కాదు. టోల్ వద్దనుకుంటే మరో చోట కొనసాగుతున్న టోల్‌ను కూడా రద్దు చేయాలి.

- బట్టల మొగిళి, గుమ్మడవెల్లి

వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలి



మానేరులో నిర్మిస్తున్న అంతర్‌జిల్లా వంతెనను పూర్తి చేసేలా అధికారులు, పాలకులు కృషి చేయాలి. వంతెన నిర్మాణానికి కృషి చేస్తే అందరికి మంచిది. చలివాగు మానేరుల్లో నిర్మించిన మట్టి రోడ్డుపై రాజకీయం సరికాదు.

- రేనుకుంట్ల సంపత్, సుబ్బక్కపల్లి

కార్మికుల సొంతింటి కల నెరవేరబోతుంది

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులకు త్వరలోనే సొంతింటి కల నెరవేరబోతోందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. ఏరియాలోని కేటీకే 6వ గనిలో మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయం పన్ను మినహాయింపు, మారుపేర్ల సవరణపై సింగరేణిలో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో చర్చించినట్లు తెలిపారు. నూతన గనులు ఏర్పాటు చేయాలని, సొంతింటి పథకం అమలు అంశాలపై సీఎండీతో చర్చించగా త్వరలోనే నేరవేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస్, మనోజ్ కుమార్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, రాజన్న, గోవర్ధన్, లక్ష్మణమూర్తి, గణేష్, సత్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు ద్రోహం చేస్తున్న సంఘాలు

- సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య



సమావేశంలో మాట్లాడుతున్న గట్టయ్య

భూపాలపల్లి అర్బన్: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులకు ద్రోహం చేస్తున్నాయని సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆరోపించారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్లాది రూపాయల సొంత ఖర్చులతో సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్ విభాగం అనేక వ్యయప్రయాసలకు ఓర్చి బొగ్గు బ్లాక్‌లను గుర్తించిందని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గనుల పాలసీ చట్టం తీసుకొచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా ఉన్న అనేక బొగ్గు బ్లాకులు వేలం ప్రక్రియలోకి పోయినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని కార్మిక సంఘాలు పోరాటం చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. జనార్దన్, కాసర్ల ప్రసాదరెడ్డి, శ్రీనివాస్, బాబు, శ్రీధర్, జయశంకర్, సాజిద్ పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం

ఏటూరునాగారం : విద్యార్థులు సమాజంపై అవగాహన అవసరం అని ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఎస్ శిరి జెడ్పీహెచ్ఎస్‌లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా హర్యానా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఇంటి దగ్గర హర్యాన వంటలను తయారు చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు వాటిని రుచి చూసి విద్యార్థులకు కితాబు ఇచ్చారు. అనంతరం పాటలు, క్విజ్, నృత్యాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో సప్తకళలు ఉండాలన్నారు. చదువు, క్రీడలు, నృత్యం తదితర అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు.

రైతు వేదికలో ‘రైతు నేస్తం’

మల్హర్: మండలంలోని కొయ్యూరు రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ శ్రీజ రైతులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతీ మంగళవారం ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులకు సంబంధించిన పలు అంశాలను ఈ కార్యక్రమంలో తెలియపరచడం జరుగుతుందన్నారు. వివిధ అంశాల మీద రీసెర్చ్ సైంటిస్టులు రైతులకు అవసరమయ్యే సమాచారాన్ని అందిస్తారని అన్నారు. విత్తనాల నుంచి పంట చేతికొచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కావాల్సిన మెలకువలు తెలియపరుస్తూ, రైతుల సందేహాలను కూడా తీరుస్తారని ఏఓ శ్రీజ పేర్కొన్నారు.



రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ, రైతులు

ప్రమాదవశాత్తు ఇళ్లు దగ్ధం



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న డీటీ శ్రీనివాస్

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎస్సీ కాలనీలో ప్రమాదవశాత్తు రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివారల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడిచర్ల ఎస్సీ కాలనీకి చెందిన ఇందారపు రవి, ఇందారపు కుమార్‌కు చెందిన ఇళ్లలో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. చుట్టూ పక్కల వారు గమనించి, కుటుంబ సభ్యులకు, స్థానిక ఏఎమ్మార్ కంపెనీకి సమాచారం ఇచ్చారు. కంపెనీకి చెందిన వాటర్ ట్యాంకర్ రావడంతో దాని ద్వారా స్థానికులు మంటలను ఆర్పారు. అప్పటికే ఇంటిలోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అక్కడి చేరుకొని నష్టం వివరాలను ప్రాథమిక అంచనా వేశారు. ఇందారపు కుమార్‌కు చెందిన ఇల్లు, ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయిందని దాదాపు రూ.15 లక్షల నష్టం జరిగిందన్నారు. అలాగే ఇందారపు రవికి చెందిన ఇల్లు పాక్షికంగా కాలిపోవడంతో దాదాపు రూ.3 లక్షల నష్టం జరిగిందని అంచనా వేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. నష్టపోయిన బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్ల ఆయన పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి ఫారెస్ట్ రోడ్డు నిర్మాణానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నిధులు మంజూరు చేయించినట్లు మాజీ ఎంపీపీ మల్హర్‌రావు తెలిపారు. మండలంలోని తాడిచర్ల సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్హర్‌రావు మాట్లాడారు. ఖమ్మంపల్లి మానేరు వంతెన నుంచి భూపాలపల్లి జిల్లా వరకు గతంలో రోడ్డుకు నిధులు మంజూరు కాగా ఫారెస్ట్ క్లియరెన్స్‌కు డబ్బులు లేక ఫారెస్ట్ రోడ్డు పనులు ఆగిపోయినట్లు తెలిపారు. కిషన్‌రావుపల్లి ఫారెస్ట్ రోడ్డు క్లియరెన్స్‌కు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రభుత్వం జీఓ నంబర్ 113 ద్వారా రూ.33.70 కోట్లు నిధులను మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకి ఈ ప్రాంత వాసుల తరుపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి, నాయకులు పేరాల వెంకటేశ్వరరావు, బొబ్బిలి రాజు, మురళీధర్ రావు, ఇందారపు ప్రభాకర్, మధుసూదన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ మల్హర్‌రావు

ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాతా

గోవిందరావుపేట : ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ స్కీం సంస్థ లింక్ వర్కర్ తొప్పెట్ల కిషన్ అన్నారు. మండలంలోని పస్రాలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాతా ప్రోగ్రాం నిర్వహించి స్థానిక ప్రజలకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ హెచ్ఐవీ నాలుగు విధాలుగా మానవులకు సోకుతుందన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాల వల్ల, కలుషితమైన సూదుల వల్ల, పరీక్షించని రక్త మార్పిడి వల్ల, హెచ్ఐవీ తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకి వస్తుందని తెలిపారు. ప్రతి గర్భిణీ తప్పకుండా హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని, ఒకవేళ ఆమెకు హెచ్ఐవీ పాజిటివ్ అని తెలిస్తే తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకి హెచ్ఐవీ రాకుండా అందుబాటులో మందులు ఉన్నాయని పేర్కొన్నారు. టీబీ పేషెంట్ హెచ్ఐవీ పరీక్ష చేయించకోవాలి సూచించారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన 48 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే మారుమూల గ్రామాలు, పంచాయతీల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ జయశ్రీ, తహసీల్దార్ హేమ, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, రాష్ట్ర, జిల్లా నాయకులు గాజర్ల అశోక్, ముకిరాల మధువంశీకృష్ణ, టేకుమట్ల మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, నాయకులు దబ్బెట అనిల్, ఎండీ రఫీ, రాజు, శ్రీనివాస్, రత్నాకర్‌రెడ్డి, ఎండీ రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే లక్ష్యం

భూపాలపల్లి రూరల్: పేద, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా మన భూపాలపల్లికి అవకాశం లభించిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పీసీసీ సభ్యులు దబ్బేట రమేశ్ ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 43 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.



నవాబుపేటలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వైద్య శిబిరాలు నిర్వహించాలి

- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మధుసూదన్

భూపాలపల్లి అర్బన్: జిల్లావ్యాప్తంగా పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లు తనిఖీలు చేసి అవసమైన చోట వైద్యశిబిరాలు నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. డీఎంహెచ్ఓ తన కార్యాలయంలో మంగళవారం ప్రోగ్రాం అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జ్వరంతో బాధపడేవారి రక్త నమూనాలను సేకరించి మలేరియా పరీక్ష చేయాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. నిర్దేశించినటువంటి తేదీలలో ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీలు నిర్వహించాలన్నారు. సరస్వతీ పుష్కరాలకు మెడికల్ క్యాంపులకు యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి తగు చికిత్స అందించాలన్నారు. ఎన్‌సీడీ క్యాంపులు నిర్వహించాలన్నారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ల పనితీరును క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవిరాథోడ్, ప్రోగ్రాం అధికారులు శ్రీదేవి, ఉమాదేవి, ప్రమోద్‌కుమార్, డెమో శ్రీదేవి పాల్గొన్నారు.

గ్రూప్స్ ఫలితాలను నిలిపేయాలి



దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భూపాలపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణను ఆమోదించేంత వరకు గ్రూప్స్ ఫలితాలను నిలిపివేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి మాదిగ ఆధ్వర్యంలో వర్గీకరణలో మాదిగలకు రిజర్వేషన్ శాతం పెంచాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరగా మందకుమార్ దీక్షలను మద్దతు పలికి మాట్లాడారు. గ్రూప్-1 గ్రూప్-2 గ్రూప్-3 ఫలితాలను వెంటనే నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిగలపై కపట ప్రేమను చూపెడుతున్నారని, దేశంలో అందరికంటే ముందే వర్గీకరణ అమలుపరస్తామని అప్పటిదాకా ఎటువంటి ఉద్యోగ నియామకాలు చేపట్టబోమని తెలిపి నియామకాలు చేపడుతున్నారని ఆరోపించారు. నాయకులు శ్రీనివాస్, దోర్నాల రాజేందర్, అంతడుపుల సురేష్, నేరుపటి అశోక్, చంటి, భరత్, భద్రయ్య, రేణిగుంట రవి, చింటూ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వావిలాల స్వామి అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమానికి స్వామి హాజరై మాట్లాడుతూ నేడు ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. గ్రూప్-1 ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని కోరారు. వర్గీకరణ చేపట్టిన తర్వాతనే ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నిధులు విడుదల చేయాలని వినతి



కాటారం/మల్హర్: కాటారం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న మండలాల దళితబంధు లబ్ధిదారుల నిధులు విడుదల చేయాలని కాటారం సబ్ డివిజన్ దళిత బంధు లబ్ధిదారులు నొళ్ల సంపత్ మహరాజ్, వేమునూరి జక్కయ్య, చకినారపు చందు, పాగే సంతోష్, పేట దేవేందర్, గడ్డం పెద్ద సమ్మయ్య హైదరాబాద్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దళితబంధు నిధుల విడుదలకు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.